కంటి సంరక్షణ అవసరం

హఫీజ్‌పేట్ : ప్రతి ఒక్కరికి కంటి సంరక్షణ ఎంతో అవసరమని వాసన్ ఐ కేర్ చందానగర్ ఇంచార్జి, చీఫ్ సర్జన్ సీనియర్ కన్సల్టెంట్ సర్జన్ డాక్టర్ రతన్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం చందానగర్ గంగారంలోని వాసన్ ఐ కేర్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ వాసన్ ఐ కేర్ ఆసుపత్రి నిరుపేద, మధ్య తరగతి వారికి కూడా అందుబాటులో ఉందన్నారు. ఈ నెల 7 వ తేదీ నూతన యంత్ర పరికరాలతో ఆసుపత్రిని ప్రారంభిస్తున్నామన్నారు. సమావేశంలో డైరెక్టర్ డాక్టర్ వికాస్ జైన్, డాక్టర్లు మమత శెట్టి, రవి కుమార్, ఖాలీద్ లతీఫ్, స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత ధ్యాన శిక్షణ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి వివేకానందనగర్ కాలనీలోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో రోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఉచిత ధ్యాన యోగ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. యువతకు క్రమశిక్షణ, పెద్దల పట్ల విధేయత, జ్ఞాపకశక్తి, ధూమపానం, మద్యపానం వంటి వాటి నుంచి విముక్తి కలిగేలా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అదే విధంగా చదువులో రాణించేందుకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వయస్సుతో సంబంధం లేకుండా స్త్రీ, పురుషులు శిక్షణలో పాల్గొనవచ్చన్నారు. ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు.

అవసరమైనచోట లేక..



ఆల్విన్ ఎక్స్ రోడ్డు వద్ద ప్రకటనలకే పరిమితమైన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి

అలంకారప్రాయంగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు
- పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- మియాపూర్ ఆల్విన్ ఎక్స్ రోడ్డు వద్ద పనిచేయని లిఫ్టులు

మియాపూర్: పాదచారుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు అలంకారప్రాయంగా మారాయి. దీంతో ప్రధాన రహదారులు దాటుతూ పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మియాపూర్, మదీనాగూడ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు ప్రజలకు ఉపయోగకరంగా లేవు. వాహనాల రద్దీ ఉండేచోట, రోడ్డు దాటాలంటే ఇబ్బందిపడే ప్రాంతాలలో ఎఫ్ఓబీలు ఏర్పాటు చేయాల్సి ఉండగా అవసరం లేని చోట ఏర్పాటు చేయడంతో ప్రకటన బోర్డులకే పరిమితమయ్యాయి. ఇక ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జిలకు సరైన నిర్వహణ లేకపోవడంతో లిఫ్టులు, ఎస్కలేటర్లు పనిచేయకపోవడంతో మహిళలు, వృద్ధులు బ్రిడ్జి ఎక్కలేక రోడ్డు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

- మియాపూర్ జాతీయ రహదారిపై రోడ్డు దాటాలంటే గగనమే. ఈ క్రమంలో 4 సంవత్సరాల క్రితం మియాపూర్ బొల్లారం, ఆల్విన్ కాలనీ ఎక్స్ రోడ్డు వద్ద, ఏడాది క్రితం మదీనాగూడలోని దీప్తీశ్రీనగర్, గంగారం సమీపంలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశారు.
- నిర్వహణ లోపం కారణంగా లిఫ్టులు, ఎస్కలేటర్లు పనిచేయకపోవడంతో మహిళలు, వృద్ధులు అధికశాతం మెట్లు ఎక్కి వెళ్లలేక రోడ్డు దాటుతున్నారు.
- ప్రజలకు అవసరమయ్యే ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయకపోవడంతో వృథాగా మారాయని అంటున్నారు.
- బొల్లారం క్రాస్ రోడ్డు, ఆల్విన్ క్రాస్ రోడ్డు సిగ్నల్స్ వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశారు.ఐతే ఇక్కడ సిగ్నల్స్ పడిన సమయంలో పాదచారులు రోడ్డు దాటుతున్నారు. దీంతో బొల్లారం క్రాస్ రోడ్డు, ఆల్విన్ క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన బ్రిడ్జిలు నిరుపయోగంగా మారాయి.
- ఎఫ్ఓబీలను మియాపూర్‌లోని న్యూ కాలనీ వద్ద మంగళవారం మార్కెట్ సమీపంలో, మియాపూర్ బస్టాప్ వద్ద, టాకీటౌన్ సినీ థియేటర్ వద్ద, సౌత్ ఇండియా షాపింగ్ మాల్, చెన్నయ్ షాపింగ్ మాల్, చందానగర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసే ఉంటే ఉపయోగపడేవని ప్రజలు వాపోతున్నారు.
- షాపింగ్‌మాల్స్ ఉన్న ఏరియాల్లో జనం తరచు రోడ్డు దాటుతూ ఉంటారు. అక్కడి నుండి ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు సుమారు 200 నుండి 300 మీటర్ల దూరంలో ఉన్నాయి. అక్కడ వరకు నడిచి వెళ్లి బ్రిడ్జి ఎక్కలేక పాదచారులు ఎక్కడపడితే అక్కడ రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు.


మియాపూర్‌లోని ఆల్విన్ ఎక్స్ రోడ్డు వద్ద పనిచేయని లిఫ్టులు


దీప్తీశ్రీనగర్ వద్ద..

గెలుపు లెక్కల్లో అభ్యర్థులు

- ముఖ్యనేతలతో సమీక్షలు

గచ్చిబౌలి: అభ్యర్థులంతా పోలింగ్ సరళిపై సమీక్షిస్తున్నారు. శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఆయా కాలనీలు, బస్తీలలో పోలింగ్ ఎలా జరిగిందని ఆరా తీశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ భారీ మెజారిటీపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.నియోజకవర్గంలో తాను చేపట్టిన అభివృద్ధి పనులే గెలిపిస్తాయన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ శేరిలింగంపల్లిలో తన గెలుపు ఖాయమంటున్నారు. 15 ఏళ్లపాటు కార్పొరేటర్‌గా సేవలందించానని, ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారని చెబుతున్నారు. శేరిలింగంపల్లిలో బీజేపీ గెలుపును ఎవరు ఆపలేరని ఆ పార్టీ అభ్యర్థి ఎం.రవికుమార్ యాదవ్ అంటున్నారు. భారీ మెజారిటీ వస్తుందని లెక్కలు వేసుకుంటున్నారు.

పోలైన ఓట్లు 3,57,829

నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 7,32,506 ఉన్నాయి. 48.75 శాతం ఓట్లు పోలయ్యాయి. అంటే దాదాపు 3,57,074 ఓట్లు పోలైనట్లు తెలిసింది. ఈ లెక్కన చూస్తే లక్షా 50 వేల ఓట్లు సాధిస్తేనే గెలుపునకు చేరువయ్యే అవకాశాలు ఉన్నాయి. 2018లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 5,75,853 ఉన్నాయి. 48.61 శాతంతో 2,79,583 ఓట్లు పోల్ అయ్యాయి. ప్రస్తుతం కేవలం 0.14 శాతం మాత్రం ఎక్కువ పోలైనప్పటికీ, మొత్తం ఓటర్ల సంఖ్య పెరగడంతో 77,991 ఓట్లు ఎక్కువగా పోలయ్యాయి.

అన్నమయ్య సంకీర్తనాలాపన



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శుక్రవారం ది ఫ్యామిలీ మెన్ యువ దర్శకుడు రాజ్ నిడిమోరుకు చిత్రబ్రహ్మ బిరుదును శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజియర్ స్వామి అందజేశారు. యువ దర్శకుడు అందించిన ఫర్జీ, గో గోవా గాన్, డీ ఫర్ దోపిడి, సినిమా బండి, స్త్రీ వెబ్ సిరీస్ ద్వారా పేరు తెచ్చుకున్న చిత్రదర్శకుడు రాజ్ నిడిమోరుకి చిత్రబ్రహ్మ అనే బిరుదును అందజేశారు. అనంతరం శోభారాజు శిష్యబృందం అన్నమయ్య కీర్తనలను ఆలపించారు.

మనూలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం


సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ సయ్యద్ ఐనుల్ హసన్

రాయదుర్గం : ప్రస్తుత పరిస్థితి 'మనిషి వర్సెస్ మెషిన్' అన్నట్లుగా మారిందని మనూ వైస్‌చాన్స్‌లర్ ప్రొ.సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం నిర్వహిస్తున్న 'ఇంజనీరింగ్ (ఆర్ఐసీఈ-2023)లో ఇంటిలిజెంట్ కంప్యూటింగ్‌లో పరిశోధనలు' అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఉర్దూ యూనివర్శిటీ, సెంట్రల్ అమెరికాలోని యూనివర్సిడాడ్ డాన్‌బాస్కో సహకారంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ప్రారంభసమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మనిషి మేధస్సు శాశ్వతమైన ఆధిపత్యాన్ని కలిగి ఉంటుందన్నారు. అనంతరం సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

వైభవంగా శత చండీ మహాయాగం

వెంకటేశ్వరనగర్‌కాలనీ: బంజారాహిల్స్ రోడ్ నంబర్-14లోని శ్రీ విజయ గణపతి ఆలయంలో లోకకల్యాణార్థం నిర్వహిస్తున్న శత రుద్ర యాగ సహిత శత చండీ మహా యాగాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. గత నెల 25న ప్రారంభమైన మహాయాగం ఈ నెల 4వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం మహాన్యాస పారాయణం, శత చండీ రుద్ర పారాయణం, హోమం, రుద్ర హవనాలు, రాత్రి చంద్రమౌళీశ్వర స్వామికి అభిషేక పూజలను వైభవంగా నిర్వహించారు.


కుటుంబ సభ్యులతో కలిసి టీవీ చూస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ


నాయకులు, స్నేహితులతో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి ఎం.రవికుమార్ యాదవ్

సేదదీరుతున్న అభ్యర్థులు


నల్లగండ్లలోని తన నివాసంలో.. కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్

గచ్చిబౌలి: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బిజీబిజీగా గడిపిన అభ్యర్థులు సేదదీరుతున్నారు. కౌంటింగ్‌కు మరో రోజు గడువు ఉండటంతో కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులతో రిలాక్స్‌గా గడిపారు. సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ వివేకానందనగర్‌లోని తన నివాసంలో భార్య శ్యామలాదేవి, మనువడు అద్వైత్ గాంధీ, కొడుకు పృథ్వీ గాంధీ, కోడలు భార్గవితో కలిసి టీవీ చూస్తూ గడిపారు. కొద్దిసేపు పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. బీజేపీ అభ్యర్థి ఎం.రవికుమార్ యాదవ్ రోజులానే ఉదయాన్నే మసీద్‌బండలోని పార్టీ కార్యాలయానికి చేరుకుని స్నేహితులు, నాయకులతో కలిసి టీ తాగుతూ, సరదాగా మాట్లాడుతూ సేద దీరారు.

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి జగదీశంర్‌గౌడ్ శుక్రవారం నల్లగండ్లలోని తన నివాసంలో పార్టీ నాయకులతో గడిపారు. అనంతరం కౌంటింగ్ వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కౌంటింగ్‌కు పంపే వారిని ఎంపిక చేయడంపై సమీక్ష చేశారు. మధ్య మధ్యలో వచ్చిపోయే వారితో మాట్లాడుతూ సమయం గడిపారు.

3న బాలబృందావనం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం చిల్డ్రన్స్ వీక్లీ కార్యక్రమంలో భాగంగా 'బాలబృందావనం' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 'ది గేమ్ ఆఫ్ కర్మ' పేరిట నిర్వహించే కార్యక్రమంలో 9 నుంచి 14 ఏళ్ళ లోపు పిల్లలకు పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040-23001234లో సంప్రదించవచ్చు.

తలమునకలు

- ఓటరు నాడి పట్టుకునేందుకు క్షేత్రస్థాయిలో నేతల కుస్తీలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యింది. అభ్యర్థుల గెలుపోటములపై క్షేత్రస్థాయిలో ఓటర్ల నాడిని పట్టుకునేందుకు రాజకీయ పార్టీల నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు. ఎన్నికల ఫలితాలు రాక ముందే వివిధ పార్టీల అభ్యర్థులు ఎవరికెన్ని ఓట్లు పడ్డాయన్న విషయంపై పార్టీ శ్రేణుల వద్ద ఆరా తీస్తున్నారు. రాజకీయ విశ్లేషకులతో సైతం చర్చిస్తూ అంచనా వేసుకుంటున్నారు. అయినా ఒక కొలిక్కి మాత్రం రాలేకపోతున్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సైలెంట్ ఓటింగ్ జరిగిందన్న చర్చ జోరుగా సాగుతోంది. ఎవరికి వారే తమ పార్టీ అభ్యర్థి గెలుస్తున్నాడంటూ జోరుగా ప్రచారం చేసుకుంటున్నారు. అయితే ఆయా పార్టీ నాయకులు తాము ఆ ప్రాంతంలో పట్టు సాధించామని చెప్పలేని పరిస్థితి కనిపిస్తోంది. గత ఎన్నికల్లో ఫలితాలు రాక ముందే పరిస్థితి ఇలా ఉండొచ్చని చెప్పుకునేవారు. కానీ ఈసారి మాత్రం ఎవరు గెలుస్తారో? ఎవరు ఓటమి పాలవుతారో నిర్ధారణకు రాలేకపోతున్నారు. నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల స్థానిక ప్రజాప్రతినిధుల అంచనాలు సైతం ఈసారి తారుమారు అయ్యే అవకాశం ఉంటుందని పలువురు చెబుతున్నారు.

గంజాయి మత్తులో దాడి

పటాన్‌చెరు టౌన్: గంజాయి మత్తులో పారిశుద్ధ్య కార్మికులపై ఓ యువకుడు దాడి చేసిన సంఘటన శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలో చోటుచేసుకుంది. కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం...పటాన్‌చెరు శాంతినగర్ కాలనీలో గంజాయి మత్తులో ఉన్న యువకుడు మంటలో చేతులు పెట్టగా పారిశుద్ధ్య కార్మికులు వద్దని వారించినందుకు వారిపై దాడి చేశాడు.కర్రతో తలపై కొట్టడంతో పారిశుద్ధ్య కార్మికుడు యాదగిరికి తలకు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు 10 కుట్లు వేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యుత్ షాక్‌తో కూలీ మృతి

పటాన్‌చెరు టౌన్: విద్యుత్ షాక్ తగిలి కూలీ మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని బంధం కొమ్ములో జరుగుతున్న భవనం పనుల్లో ఒరిసాకు చెందిన సత్యబ్రత్ చంద్ర(20) పది నెలలుగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో 30వ తేదీ పనిచేసే చోట మిషన్‌తో తొమ్మిదో ఫ్లోర్‌లో రాడ్ కట్ చేసి, ఆ తర్వాత విద్యుత్ బాక్స్ నుండి మిషన్‌కు సంబంధించిన వైర్ తీస్తుండగా షాక్ తగిలింది.దీంతో తీవ్రంగా గాయపడ్డ సత్యబ్రత్ చంద్రను స్థానికంగా ఆసుపత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు వెల్లడించారు సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అపార్ట్‌మెంట్ కాంట్రాక్టర్ సంజయ్, సైట్ మేనేజర్ సురేష్ బాబుల నిర్లక్ష్యం కారణంగానే విద్యుత్ షాక్ తగిలి తన కుమారుడు మృతి చెందాడని తండ్రి శీతాకాంత్ శుక్రవారం ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రిటైర్ అయిన నెలలో పింఛన్ పత్రాలు మంజూరు

భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్

పటాన్‌చెరు: పదవీ విరమణ పొందిన నెలలోనే పింఛన్ పత్రాలు మంజూరు చేస్తున్నామని భవిష్య నిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలోని పీఎఫ్ కార్యాలయంలో నవంబర్‌లో 17 మందికి పింఛన్ మంజూరు చేయగా అందులో 9 మందికి పింఛను మంజూరు పత్రాలను అందజేశారు . ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ మాట్లాడుతూ... యాజమాన్యాలు, రిటైరయిన వారు పింఛను దరఖాస్తు ఫారమ్ తో పాటుగా ఇతర సంబంధిత పత్రాలు జతచేసి సకాలంలో అందజేస్తే వారికి రిటైర్ అయిన నెలలోనే పింఛను మంజూరు పత్రాలను అందజేస్తామన్నారు . కార్యక్రమంలో అసిస్టెంట్ పి.ఎఫ్ కమిషనర్ ఆర్.శ్రీదేవి, అకౌంట్స్ అధికారి మనోజ్ కుమార్ పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు



మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో కార్తీకమాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశ్వేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. 4వ తేదీ మూడో సోమవారం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు ఉంటాయని ఆయన తెలిపారు.

అంతర్జాతీయ అనుసంధానమే లక్ష్యం

డెల్లా లీడర్స్ క్లబ్ హైదరాబాద్ లక్ష్యం



షెరటాన్ హోటల్‌లో డీఎల్సీ హైదరాబాద్ సమావేశంలో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: పారిశ్రామికవేత్తలను అంతర్జాతీయ అనుసంధానం చేయడమే డెల్లా లీడర్స్ క్లబ్ హైదరాబాద్ లక్ష్యమని వక్తలు పేర్కొన్నారు. నానక్‌రాంగూడలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని షెరటాన్ హోటల్‌లో శుక్రవారం రాత్రి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీరామ్ బిల్డర్ అండ్ డెవలపర్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాలాజీరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంటర్‌ప్రెన్యూర్ కమ్యూనిటీ బిల్డర్, జిమ్మీ మిస్త్రీ డెల్లా లీడర్స్ క్లబ్ హైదరాబాద్ చాప్టర్ బోర్డును ప్రకటించారు. అత్యంత క్యూరేటెడ టెక్నాలజీ ఎనేబుల్డ్ గ్లోబల్ ఫ్లాట్‌ఫామ్ అయిన డెల్లా లీడర్స్ క్లబ్ అనేది విజ్ఞాన మార్పిడి, జీవనశైలి మార్గదర్శకత్వం, సామాజిక బాధ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల నాయకులకు మద్దతు ఇచ్చే పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తోందన్నారు. కార్యక్రమంలో కౌన్సెలేజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు ఎండీ సుహెల్ సేథ్, విశ్రాంత ఐఏఎస్ అధికారి బిపి ఆచార్య, ఐటీ నిపుణులు జేపీ చౌదరి, బజాజ్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సీఈఓ కరణ్ బజాజ్ ప్రసంగించారు.

మూడంచెల భద్రత



- స్ట్రాంగ్ రూమ్ వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- కలెక్టర్ శరత్, ఎస్పీ రూపేశ్

పటాన్‌చెరు టౌన్: ఈవీఎంలు, వీవీ పాట్లు పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచామని కలెక్టర్ శరత్, ఎస్పీ రూపేశ్ అన్నారు. మూడంచెల భద్రతను ఏర్పాటు చేసి, పోలీసు అధికారులకు బందోబస్తు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగిస్తూ సిబ్బందికి సూచనలు చేశామని తెలిపారు. శుక్రవారం స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాటు చేసిన కట్టుదిట్టమైన భద్రతను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పటాన్‌చెరు, సంగారెడ్డి, నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్‌కు సంబంధించిన ఎన్నికల సామగ్రికి బలగాలు కంటికి రెప్పల పహారా కాస్తుంటాయని తెలిపారు. ఎలాంటి నిర్లక్ష్యానికి అవకాశం లేకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలను తీసుకుంటున్నట్లు, సీసీ కెమెరాల పనితీరును కమాండ్ కంట్రోల్ నుంచి వీక్షించి రక్షణ అధికారులకు ఎల్లవేళలా సూచనలు చేస్తామని తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం అనుమతి ఉన్న ప్రత్యేక అధికారులే సందర్శిస్తూ ఎప్పటికప్పుడూ రక్షణ చర్యలు చేపడుతున్నారన్నారు. సందర్శించే అధికారి పేరు, వెళ్లిన సమయం, తప్పనిసరిగా భద్రత అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక రిజిస్టార్లలో పొందుపరుస్తూ సంతకాలను సేకరిస్తారని పేర్కొన్నారు. ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ రాత్రి సమయంలో పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహిస్తూ, భద్రత చర్యలను సమీక్షిస్తూ ఉండాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల అబ్జర్వర్లు, రిటర్నింగ్ అధికారులు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పటాన్‌చెరుకు ఈవీఎంల తరలింపు

జహీరాబాద్: నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను పటాన్‌చెరులో ఉన్న గీతం వర్సిటీలోని కౌంటింగ్ కేంద్రానికి తరలించారు. పట్టణంలోని స్ట్రాంగ్ రూం ఉండగా అధికారులు.. అభ్యర్థులు, వారి ప్రతినిధుల సమక్షంలో సీల్ తీసి ఈవీఎంలను తరలించారు. శుక్రవారం కలెక్టర్ శరత్, ఎన్నికల పరిశీలకులు పవన్‌కుమార్, డీఎస్పీ రఘు పర్యవేక్షించారు.

చివరి 2గంటల్లో లక్ష ఓట్లు పడ్డాయి

- అత్యధికంగా సేవాలాల్ నగర్‌లో 83.91 శాతం
- అత్యల్పంగా మలేషియా టౌన్‌షిప్‌లో 37.40 శాతం



కూకట్‌పల్లి: సార్వత్రిక ఎన్నికల్లో కూకట్‌పల్లి నియోజకవర్గ ఓటర్ల తీరు అయోమయానికి గురి చేసింది. ఉదయం నుంచి 3 గంటల వరకు ఓటు వేయడానికి ప్రజలు రాలేదు. ఇక ఆఖరి గంటలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ప్రజల తీరు పలు సందేహాలకు తావిస్తోంది. మధ్యాహ్నం 3 గంటల వరకు 32 శాతం ఉన్న పోలింగ్ 4 గంటల తరువాత ఊహకందని రీతిలో సుమారు లక్ష మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరంతా ప్రభుత్వ అనుకూల ఓటర్లా, ప్రతికూల ఓటర్లా అనే సందేహాలు తలెత్తుతున్నాయి.

- ఆఖరి గంటలో వచ్చిన ఓటర్లు ఏమైనా నిశ్శబ్ద విప్లవాన్ని సృష్టిస్తే అభ్యర్థుల జాతకాలు తారుమారయ్యే అవకాశం లేకపోలేదు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు 5.32 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది.
- అదే విధంగా 11 గంటలకు 15శాతం ఓటింగ్ కూడా నమోదు కాలేదు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 22 శాతం మాత్రం ఓటింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం తరువాత పోలింగ్ ఇంకా మందకొడిగా సాగింది.
- 3 గంటల వరకు 32.74 శాతం పోలింగ్ జరగగా, ఆఖరి రెండు గంటల్లో 32 నుంచి ఏకంగా 53.96 శాతానికి పెరిగిందంటే ఓటర్లు ఆ సమయంలో పెద్ద సంఖ్యలో తరలి రావటానికి కారణాలు ఏమై ఉంటాయని అని పలువురు విశ్లేషిస్తున్నారు.
- చివరి నిమిషంలో లక్ష ఓట్లు పోలయ్యాయంటే కూకట్‌పల్లి నియోజకవర్గంలో కూడా ప్రభుత్వ వ్యతిరేక ఓటు నిశ్శబ్ద విప్లవాన్ని సృష్టిస్తుందా.. అనేది అర్థం కాని పరిస్థితి నెలకొంది.
- నియోజకవర్గంలోని బాలాజీనగర్ డివిజన్‌లోని సేవాలాల్ నగర్ 217వ బూత్‌లో అత్యధికంగా 83.91 శాతం ఓట్లు పోలయ్యాయి. అదే విధంగా కేపీహెచ్‌బీ డివిజన్ మలేషియా టౌన్‌షిప్‌లోని 338వ బూత్‌లో అత్యల్పంగా 37.40 శాతం ఓట్లు పోలయినట్లు అధికారులు తెలుపుతున్నారు. చివరి నిమిషంలో విద్యావంతులు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలుస్తోంది. బస్తీల్లో మధ్యాహ్నం వరకు భారీ ఎత్తున పోలింగ్ కాగా చివరి గంటలో కాలనీ, విల్లాల్లో ఎక్కువ ఓటింగ్ జరిగినట్లు తెలుస్తోంది. చివరి నిమిషంలో పడ్డ ఓట్లే గెలుపోటములను నిర్ణయిస్తాయని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు.

నేతల్లో టెన్షన్!

- బొల్లారం మున్సిపల్ పరిధిలో 6.5 శాతం తగ్గిన పోలింగ్
- ఎటు ప్రభావం చూపుతుందోనని పార్టీ శ్రేణుల్లో ఆందోళన


బొల్లారం మున్సిపల్ వ్యూ

జిన్నారం(పటాన్‌చెరు): గతంతో పోలిస్తే ఈ ఏడాది పోలింగ్ శాతం తగ్గింది. ఈ ప్రభావం ఎవరిపై పడుతుందోనని నాయకుల్లో టెన్షన్ మొదలైంది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు చెందిన ప్రజలు వారి సొంత ఊళ్లల్లో ఓటు వేసేందుకు తరలి వెళ్లటంతో పోలింగ్ శాతం తగ్గిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో 22 వార్డులు ఉన్నాయి. ఇక్కడ ఉన్న పలు పరిశ్రమల్లో ఆయా రాష్ట్రాలకు చెందిన ప్రజలు కార్మికులుగా పని చేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ 60 వేల వరకు జనాభా ఉంది. 33,935 మంది ఓటర్లు ఉన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో బొల్లారం మున్సిపల్ పరిధిలో 19,852 ఓట్లు పోలయ్యాయి. 58.50 శాతంగా పోలింగ్ నమోదైంది. కాగా గత ఎమ్మెల్యే ఎన్నికల్లో 65 శాతం ఓట్లు నమోదయ్యాయి. అంటే 6.5 శాతం తక్కువ. మరో ఐదు వేల వరకు ఓట్లు పోలవ్వాల్సి ఉంది. బొల్లారం మున్సిపల్ పరిధిలో మహబూబ్‌నగర్, నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి, మెదక్ తదితర జిల్లాలకు చెందిన ప్రజలు ఎక్కువ సంఖ్యలో నివాసం ఉంటున్నారు. కాగా అక్కడి నేతల ఒత్తడితో ఓటు వేసేందుకు వారు సొంత ఊళ్లకు ఎక్కువ సంఖ్యలో వెళ్లారు. దీంతో ఓటింగ్ శాతం తగ్గింది. ఈ తగ్గుదల ఏ అభ్యర్థిపై ప్రభావం చూపుతుందోనని నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మున్సిపల్ పరిధిలో ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీఎస్పీ పార్టీల మధ్య పోటీ ఎక్కువగా ఉంది. గెలుపోటములపై ఎవరి లెక్కలు వారికి ఉన్నాయి. ఇక ఈనెల 3న జరిగే కౌంటింగ్‌లో ఏ అభ్యర్థి విజయాన్ని సొంతం చేసుకుంటారో చూడాలి.